క్లుప్తంగా

నాగోబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో సోమవారం నిర్మల్ జిల్లా నూతనంగా ఎన్నికైన బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్‌తో పాటు జిల్లా నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మెస్రం వంశీయులు బీజేపీ నాయకులను శాలువాతో సన్మానించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, శివకుమార్ జైస్వాల్, మారుతి దేవ్‌పూజే, మెస్రం తుకారం,దిలీప్ మోరే,మస్కే రాజువర్ధన్ పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిశారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ ఇండియా బంజారా సేవ సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మహాగావ్ గ్రామంలో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరిగిపోవడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రారంభం అయిందన్నారు. చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు గోస పడుతున్నారన్నారు. జిల్లాస్థాయి అధికారులు పర్యటించి శాశ్వతంగా నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా.. నేటికి నెరవేరలేదన్నారు.

లబ్ధిదారుల ఎంపికకు రేపు ఇంటర్వ్యూ

ఇంద్రవెల్లి: ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి కోసం ఇంద్రవెల్లి మండలానికి రూ. 50 వేలతో ఒక యూనిట్ మంజూరు చేయగా.. ఆ యూనిట్ లబ్ధిదారుల ఎంపిక కోసం ఈనెల 5న దివ్యాంగులతో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణం కోసం దరఖాస్తు చేసిన దివ్యాంగులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

ఇచ్చోడ: సేవాలాల్ విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సేవాలాల్ బోథ్ నియోజకవర్గ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాథోడ్ అనిల్‌కుమార్, కార్యదర్శి రాథోడ్ గణేష్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ఇచ్చోడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని లోయపల్లితండాలో గుర్తు తెలియని దుండగులు సేవాలాల్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

శనగ కొనుగోళ్లు ప్రారంభం



ప్రారంభిస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈవో రాథోడ్ ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 5650తో శనగలను కొనుగోళ్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శనగ కొనుగోళ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ రమేశ్, సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకే మొగ్గు



తాంసిలో సాగు చేస్తున్న జొన్న పంట

- తగ్గిన వేరుశనగ సాగు
- ప్రత్యామ్నాయంగా జొన్న, శనగ, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు

తాంసి: ఈఏడాది ఎక్కువగా ఆరుతడి పంటలైన జొన్న, శనగ, మొక్కజొన్న, కూరగాయలతో పాటు ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపారు. పత్తి వానాకాలం సీజన్‌లో సాగు చేసినప్పటికీ యాసంగిలో మాత్రం శనగ, జొన్న, మొక్కజొన్న సాగు చేస్తున్నారు. తక్కువ నీటితో ఆరుతడి పంటలను పండిస్తున్నారు.

పంటల సాగు ఇలా..

తాంసి, భీంపూర్ మండలాల్లో రైతులు రబీలో సుమారుగా 8 వేల ఎకరాలల్లో ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. శనగ పంట ఇప్పటికే చేతికి రాగా అమ్మకానికి రైతులు సిద్ధంగా ఉన్నారు. ఎకరాకు సరసరి 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ప్రభుత్వం శనగపంటతో పాటు రైతులు జొన్న, మొక్కజొన్న, గోధుమ, కూరగాయల పంటలను కూడా పెద్దమొత్తంలో సాగు చేస్తున్నారు. వడ్డాడి, కప్పర్ల, పొన్నారి, తాంసి, జామిడి, పాలోడి, సావర్గాం, గోట్కూరి, బండల్‌నాగాపూర్‌తో పాటు భీంపూర్ మండలంలో వడూర్, అంతర్గాం, గోముత్రి, అర్లి(టి), కరంజి, భీంపూర్, వడ్‌గాంలో ఆరుతడి పంటలు పండిస్తున్నారు.

వేరుశనగ వైపు..

గత యాసంగి సీజన్‌లో వేరుశనగ పంటను సాగుచేసిన రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఈ ఏడాది రైతులు వేరుశనగ వైపు మొగ్గు చూపకుండా ఆరుతడి పంటలను సాగుచేసి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆశించే విధంగా శనగ, జొన్న, కూరగాయలను సాగు చేస్తున్నారు. వేరుశనగను కేవలం 40 నుంచి 50 ఎకరాలలో మాత్రమే సాగు చేస్తున్నారు. గతంలో పంటలకు సరైన ధర, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో వేరుశనగ కాకుండా ఇతర పంటల వైపు రైతులు మొగ్గు చూపారు.

దిగుబడి రావడం లేదు



గతేడాది వేరుశనగ సాగు చేసిన రైతులకు పెట్టుబడి కూడా రాలేదు. పంటను వేయడానికి విత్తన ధరతో పాటు ఎరువులు, కలుపు తీయడం వంటి ఖర్చు అధికంగా ఉంటుంది. గతేడాది సాగుచేసిన రైతులకు పంట చివరి దశలో బోర్‌మోటార్ల నుంచి సాగునీరు రాక అవస్థలు పడ్డారు.

– చిల్కూరి చిన్నరాంరెడ్డి, తాంసి

తక్కువ ఖర్చుతో



గత ఏడాది వేరుశనగ సాగు చేయడం వలన తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈఏడాది తక్కువ ఖర్చుతో జొన్న సాగు చేశాను. జొన్న పంటకు తెగుళ్ల బెడద ఉండదు. కూలీల అవసరం కూడా అంతగా ఉండదు.

– మలపతి శంకర్, పొన్నారి

ఒక్క యూనిట్..80 దరఖాస్తులు

- యూనిట్ ఎవరికి వరిస్తుందో..
- ఎలా ఎంపిక చేయాలని అధికారుల తర్జనభర్జన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక చాలా మంది నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా మంది నిరుద్యోగులు ప్రభుత్వం అందజేసే సబ్సిడీ రుణాల కోసం ఆయా శాఖలకు దరఖాస్తులు చేసుకుంటారు. అందులో భాగంగానే దివ్యాంగులకు ప్రభుత్వం ఆ శాఖ ద్వారా సబ్సిడీపై రుణాలను అందజేస్తుంది. సబ్సిడీ రుణాల మంజూరు కోసం మండలంలోని అర్హత కలిగిన దివ్యాంగుల నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులను ఆహ్వానించింది. వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో కొంత మంది కిరణా షాప్, డీటీపీ సెంటర్ ఏర్పాటు, తదితర యూనిట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

ఒక్క యూనిట్..80 దరఖాస్తులు

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని దివ్యాంగుల నుంచి వంద శాతం సబ్సిడీపై రూ. 50వేల యూనిట్‌కు దరఖాస్తులను ఆహ్వానించింది. మండలానికి దివ్యాంగుల యూనిట్ ఒక్కటి ఉండగా 80 మంది దివ్యాంగ లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాను తమకు పంపించాలని సంబంధిత శాఖ అధికారులు ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేయడంతో ఆన్‌లైన్‌లో వచ్చినా లబ్ధిదారుల జాబితాను అధికారులు పరిశీలిస్తున్నారు.

ఎంపికలో తర్జభర్జన..

దివ్యాంగుల యూనిట్‌కు పదుల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది. ఎవరిని ఎంపిక చేయాలో తర్జనభర్జన పడుతున్నారు. ఇదిలా ఉండగా 80 మందిలో ముగ్గురుని ఎంపిక చేసి ఆ ముగ్గురి పేర్లను జిల్లా ఉన్నతాధికారులకు సిఫారస్సు చేయనున్నారు.

80 దరఖాస్తులు వచ్చాయి



దివ్యాంగులకు వంద శాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్ కోసం మండలంలో 80 మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారుల జాబితాను పంపించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆ 80 మందిలో ముగ్గురిని ఎంపిక చేసి జిల్లా ఉన్నతాధికారులకు జాబితాను అందజేయనున్నాం.

– నాగేశ్వర్ రెడ్డి, ఎంపీడీవో, ఆదిలాబాద్ రూరల్

సమాజానికి ఆదర్శంగా నిలవాలి



ప్రభుత్వ ఉద్యోగులతో మాదిగ జాగృతి సంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: నూతనంగా ఉద్యోగాలు సాధించి పదోన్నతులు పొందిన ఉద్యోగులు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పలువురు నేతలు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన వారు మహనీయుల ఆశయాలను కొనసాగించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉద్యోగులకు, పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ఆత్మీయంగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్ట్ కుంటాల రమేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మన జాతులకు మనమే అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్ మహరాజ్, అన్నెల లక్ష్మణ్, అగ్గిమల్ల గణేష్, ఈర్ల దయాకర్, శ్రీకర్, అన్నెల ఆడేల్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి భూమిపూజ

తాంసి: మండలంలోని హస్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరైన ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో మోహన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ నజీర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. హస్నాపూర్‌లో మొదటి విడుతలో భాగంగా 67 మందికి ఇళ్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లావణ్య రెడ్డి, తదితరులు ఉన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి



ఆహ్వాన పత్రం అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నగేశ్

ఆదిలాబాద్: జాతీయ దివ్యాంగ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు మెస్రం నగేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగ మహిళలపై దేశంలో రోజురోజుకు ఆకృత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. వీటికి అడ్డుకట్ట వేయడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని సంక్షేమ పథకాల్లో దివ్యాంగ మహిళలకు ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. అరిఫా, కుంర శత్రుఘన్, చుక్కబొట్ల పొచ్చన్న, వజ్రాల పొచ్చన్న, అనసూయ, బుచ్చక్క, పద్మ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: ఈనెల 8న ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని కుమురం భీం కాలనీలో నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడలో పర్ధాన్ పెద్దలకు కరపత్రాలు అందజేశారు. జిల్లా నలుమూలల నుంచి 9 తెగల ఆదివాసీలు, అనుబంధ సంఘాల నాయకులు భారీగా తరలిరావాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి గేడం భారత్, సోయం మురహరి, బారిక్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కళ్లద్దాలు అందిస్తాం

బోథ్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో 92 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, సొనాల మండలంలోని పార్డి(బి) గ్రామంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, నేరడిగొండ మండలంలోని కేజీబీవీ, ఆశ్రమ ఉన్నత పాఠశాల, కుంటాలలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల, బజార్‌హత్నూర్ మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇదివరకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పాఠశాలలల నుంచి 92 మంది విద్యార్థులకు బోథ్ సీహెచ్‌సీలో మరోసారి కంటి పరీక్షలు నిర్వహించగా, 89 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. త్వరలోనే వారికి కళ్లద్దాలను పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజనాల రవీంద్ర ప్రసాద్, ప్రొఫెసర్ డి. సౌమ్య, ఆప్తాల్మిక్ అధికారి ఆర్.భాస్కర్, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కారు దగ్ధం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బృందావన్ కాలనీలో పార్కింగ్ చేసి ఉన్న ప్రభుత్వ ఉద్యోగి మధుసూదన్ కారు సోమవారం దగ్ధమైంది. ప్రతీ రోజు మాదిరిగానే కారును పార్కింగ్ చేశాను. దగ్ధమైనట్లు చుట్టూ పక్కాల వారు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్నాను. అప్పటికే కారు మంటల్లో కాలిపోయింది. కారు దగ్ధంపై అనుమానం ఉందన్నారు.

స్పందించారు.. సమస్యను పరిష్కరించారు



లీకేజీను సరిచేసిన దృశ్యం

సాక్షి స్పందన

నేరడిగొండ: 'భగీరథ నీరు లీకేజ్' అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని పీచర గ్రామానికి వెళ్లే మిషన్ భగీరథ నీరు మార్గమధ్యలో లీకేజ్ అవుతుందని తెలుపగా స్పందించిన వాటర్‌గ్రిడ్ డీఈ బుక రమాకాంత్ సిబ్బంది ద్వారా లీకేజీని సరి చేయించారు. దీంతో పీచర గ్రామంతో పాటు అద్దాల తిమ్మాపూర్, లక్ష్మీపూర్ గ్రామస్తులకు నీటి సమస్యలు తీరాయి.

కరాటేలో 'వేదం' విద్యార్థుల ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

బోథ్: మండల కేంద్రంలోని వేదం పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడో నేషనల్ ఇన్విటేషన్ కరాటే ఛాంపియన్‌షిప్‌– 2025తో సత్తాచాటారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు వెండి, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులు జోహా, హరిని, సహస్రయ మేఘన, అభిలాష్, సాయి వర్ధన్, శ్రీమాన్, సంహితలు సిల్వర్ కటాస్‌లు సాధించారు. శ్రీచరణ్ బ్రాంజ్ మెడల్‌ను అందుకున్నాడు. మెడల్స్ సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పచ్చిపాల సంతోష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు

నీటి ఎద్దడిని నివారించండి

బోథ్: మండల కేంద్రంలోని నీటి ఎద్దడిని నివారించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ బోథ్ ఎంపీడీవో రమేశ్, ఈవో అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికీ నీరు అందేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

టీపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిని కలిసిన కంది



మీనాక్షి నటరాజన్‌తో కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: తెలంగాణ పీసీసీ వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌ను కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి సోమవారం కలిశారు. మహారాష్ట్ర వార్ధాలోని సేవాగ్రామ్‌లో జరిగిన సమావేశానికి హాజరైన ఆమెను పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్కతో కలిశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించినట్లుగా తెలిపారు.

నేటి నుంచి సిరిచెల్మ మల్లన్న జాతర



ముస్తాబైన సిరిచెల్మ మల్లన్న ఆలయం

- ఈనెల 11 వరకు నిర్వహణ

ఇచ్చోడ: జిల్లాలో అతిపురాతన సిరిచెల్మ మల్లన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. జాతర కోసం గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం ఆలయ గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ప్రారంభిస్తారు. ఈనెల 4న ప్రారంభమైన జాతర 11న తెల్లవారు జామున అగ్నిగుండం నిర్వహణతో ముగుస్తుంది. జాతర ముగింపునకు ఒక్కరోజు ముందు ఆలయ ఆవరణలో అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. ఈ గుండం నుంచి భక్తులు నడుచుకుంటూ వెళ్లి మొక్కలు తీర్చుకోవడం జాతర ప్రత్యేకత. వేంకటేశ్వర స్వామి, మల్లన్న రథలతో ప్రధాన విధులు గుండా ఊరేగింపు నిర్వహించడంతో జాతర ముగుస్తుంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలివచ్చి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయం...

జిల్లాలో అతిపురాతన శివాలయాల్లో సిరిచెల్మ మల్లన్న ఆలయం ఒక్కటి. ఈ ఆలయం కాకతీయుల కాలంలో చెరువు మధ్యలో నిర్మించారు. చుట్టూ చెరువు మధ్యలో ఆలయం తూర్పు ముఖ ద్వారంతో ఉంటుంది. సూర్యుడు ఉదయించగానే సూర్య కిరణాలు నేరుగా గర్భగుడిలోని శివలింగంపై పడటంతో చిమ్మచికట్లో ఉన్న శివలింగం దివ్య కాంతులతో వెలిగిపోవడం ఆలయంలో మరో ప్రత్యేకత. ఈ ఆలయంలో అంజనేయుడు, శనిదేవుడు, మహిషాసురవర్ధిని, ఏడుపడగల నాగపాము, విగ్రహాలు, కళాభిమానులను ఆకట్టుకుంటాయి. చతుర్ముకుడైన జైన తీర్థాంకరుడు, ధ్యాన ముందులో ఉండే బుద్ధుడి ప్రతిమలతో ఆలయం రమనీయతతో వెలిగిపోతుంది. శ్రీనివాసుని ప్రతిమ ఆలయం కుడి పక్కన ఉంటుంది. ఆ విగ్రహం చేతిలో నాణేలు అతుక్కుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. మండల కేంద్రం నుంచి 18 కిలో మీటర్ల దూరంలో అటవీ ప్రాంతలో ఆలయం ఉంటుంది. జాతర సందర్భంగా ఆర్టీసీ బస్సు ఏర్పాటు చేస్తారు. ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాల సౌకర్యం ఉంటుంది.


జీవన విధానంతో జీవితకాలం పెంపు



అవగాహన కల్పిస్తున్న డా.కోమల్

ఆదిలాబాద్‌టౌన్: డయాలసిస్ బాధితులు జీవన విధానంలో మార్పులు చేసుకోవడం ద్వారా జీవితకాలాన్ని పొడగించుకోవచ్చని ముంబాయికి చెందిన నెఫ్రాలజీస్టు కోమల్ బాధితులకు సూచించారు. సోమవారం ఆపెక్స్ సంస్థ ఆధ్వర్యంలో టెలిమెడిసిన్ కార్యక్రమం ద్వారా రిమ్స్‌లో చికిత్స పొందుతున్న డయాలాసిస్ బాధితులతో మాట్లాడారు. ఏ ఆహార పదార్థాలు తీసుకోవాలి, మెడిటేషన్, జీవన విధానం వంటి తదితర అంశాలపై తెలియజేశారు. రిమ్స్‌లో రోజుకు 40 మందికి డయాలసిస్ చేస్తున్నట్లు డయాలసిస్ ఇన్‌చార్జి ప్రేందాస్ తెలిపారు. 97 మంది రిమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ జీవన్, ఆరోగ్యశ్రీ టీం లీడర్ వ్యాస్, రమేశ్ పాల్గొన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న మహిళలు

నేరడిగొండ: పేదింటి అమ్మాయి పెళ్లికి గ్రామంలోని ఆడపడుచులందరు ఒక్కటయ్యారు. మండలంలోని మంగల్‌మోట (తర్నం) గ్రామానికి చెందిన యువతి వివాహం సోమవారం జరగగా అరవై కుటుంబాల ఆడపడుచులు రూ.12,342 జమ చేసి పెళ్లి కోసం తమవంతు సాయం అందించారు. ఆదివాసీ గ్రామాల్లో కట్న కానుకలను నిషేధిస్తూ ఆదివాసీలు తీర్మానం చేసిన విషయం విధితమే. దీంతో ఎలాంటి కట్నకానుకలు లేకపోగా తమవంతుగా వీటిని అందించినట్లు పేర్కొన్నారు.

సిరికొండ: మండలంలోని సోన్‌పెల్లి గ్రామంలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం అయి నిరాశ్రయులైన వాగ్మరే మాధవ్ కుటుంబానికి ఎస్సై శివారం రూ. 5 వేల ఆర్థిక సాయంతో పాటు దుప్పట్లు, నిత్యావసర సరుకులు సోమవారం అందజేశాడు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ కదం సూర్యకాంత్, బోయిన్‌వాడ్ అమోల్, సిబ్బంది ఉన్నారు.